క్లుప్తంగా

నేటి నుంచి ఈదమ్మ జాతర



అమ్మవారి ఆలయం

దౌల్తాబాద్: ఈదమ్మ జాతర శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరగనుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం జల్దిబిందె, సాయంత్రం బోనాల కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు రెట్టపట్ల కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ ఉత్సవాలకు కర్నాటకతో పాటు మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారని, అందుకు అనుగుణంగా ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు.

పేదలకు వరం కల్యాణలక్ష్మి

ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

దౌల్తాబాద్: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం ఓ వరం లాంటిదని ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులు ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. ఆడపిల్ల పెళ్లి తల్లిదండ్రులకు భారం కావొద్దని ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.లక్ష 116 సాయంగా అందజేసి పెద్ద దిక్కుగా నిలుస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ మహిపాల్, వైస్‌ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ శిరీష, డీటీ చాంద్‌పాష, నాయకులు మొహన్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, జాకీరఅలీ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేస్తే జరిమానా



దుకాణదారుడికి నోటీసు అందజేస్తున్న కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి

కుల్కచర్ల: బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేస్తే జరిమానా తప్పదని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో పలు దుకాణదారులు ఆరుబయట చెత్తవేయడంతో వారికి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడ పడితే అక్కడ చెత్తవేయరాదని, గ్రామపంచాయతీ ట్రాక్టర్లోనే చెత్త వేయాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా విధిస్తామన్నారు.

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చంద్రయ్య



పరిగి: తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పరిగి పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రయ్య నియమితులయ్యారు. బుధవారం హైదారాబాద్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని నియమించించారు. అందులో చంద్రయ్యకు ఉపాధ్యక్షుడిగా స్థానం కల్పించారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో టీడీపీ క్రియాశీలకపాత్ర పోషిస్తుందన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు



వడ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ చిన్నప్పల నాయుడు

తాండూరు రూరల్: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని నిర్వాహకులకు తహసీల్దార్ చిన్నప్పల నాయుడు సూచించారు. గురువారం గోనూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. కేంద్రాల నుంచి లారీల్లో ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని డీసీఎంఎస్ సిబ్బందికి సూచించారు. అన్నదాతలకు గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూసుకోవాలని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ బాలరాజు, నాయకులు మల్లేశం, గౌతమ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ధర్మాసుపత్రుల బలోపేతానికి కృషి

- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స
- డయాలసిస్ కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని సర్కారు దవాఖానాలో డయాలసిస్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ధర్మాసుపత్రిలో వైద్య సేవలు మెరుగు పడ్డాయని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలను సమకూర్చుతుందని తెలిపారు. తెలంగాణ ఏర్పడక ముందు రాష్ట్రంలో కేవలం మూడు డయాలసిస్ కేంద్రాలు మాత్రమే ఉండేవని, కాని నేడు 101 కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఇపుడు ఇక్కడ రూ. కోటితో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా.. ఎంతో మంది రోగులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. గతంలో ఈ సదుపాయం లేక రోగులు వికారాబాద్, తాండూర్ తదితర ప్రాంతాల్లో చికిత్స పొందేవారని, కా ని నేడు మన ప్రాంతంలోనే ప్రతి రోజు 20 మందికి డయాలసిస్ చేసేందుకు ఏర్పాటు చేశామన్నారు.

త్వరలో అంబులెన్స్..

ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ చేసుకునే వారికి ప్రభుత్వం కొత్తగా పింఛన్ కూడా అందిస్తుందన్నారు. సీడీపీ నిధుల నుంచి ఈ ఆసుపత్రికి ఒక అంబులెన్స్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామని, డయాలసిస్ కేంద్రంతో పాటు ట్రామా సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన చౌడాపూర్ మండలానికి త్వరలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వం మంజూరు చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, ఆసుపత్రి సూపరింటిండెంట్ షాజియా, నాయకుడు ప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్లు కృష్ణ, మునీర్, రవీందర్, నాగేశ్వర్, కిరణ్, వెంకటేశ్, నాయకులు మౌలానా తదితరులు పాల్గొన్నారు.

యువతను ప్రోత్సహించేందుకే క్విజ్

డీసీసీ అధ్యక్షుడు టి. రామ్మోహన్ రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

దోమ: యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ పోటీలు నిర్వహిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు టి. రామ్మోహన్ రెడ్డి చెప్పారు. గురువారం తిమ్మాయిపల్లి గ్రామంలో 'రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్' సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, యువతీ యువకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పోటీలకు 16 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన వారు అర్హులన్నారు. ఈ ప్రక్రియను జూన్ 17వ తేదిలోపు 7661899899 నంబర్‌కు మిస్డ్ కాల్ చేసి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జూన్ 18న పరీక్ష ఉంటుందని, విజేతలకు ఓ స్కూటి, సెల్‌ఫోన్, ఐపాడ్‌లాంటి బహుమతులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాంచంద్రారెడ్డి, రాంరెడ్డి, గుండాల రాంచంద్రారెడ్డి, యాబద్దీన్, రాములు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీకి గ్రామ కమిటీ అధ్యక్షుడి రాజీనామా

పెద్దేముల్: బీఆర్‌ఎస్ బుద్దారం గ్రామ కమిటీ అధ్యక్షుడు తలారీ శ్రీనివాస్ (ముదిరాజ్) పార్టీకి, సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోగ్యం సహకరించడం లేనందున తప్పుకుంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు రాజీనామా లేఖను పార్టీ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్‌కు వాట్సప్ ద్వారా పంపినట్లు వెల్లడించారు.

వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడి నియామకం



షర్మిలను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రసాద్

వికారాబాద్ అర్బన్: వైఎస్ఆర్‌టీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉప్పరి ప్రసాద్‌ను నియమిస్తూ.. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గురువారం నియామక పత్రం అందజేశారు. గతంలో ప్రసాద్.. వికారాబాద్ నియోజకవర్గంలో పార్టీ కో ఆర్డినేటర్‌గా పని చేశారు. ఈ మేరకు ప్రసాద్ పార్టీ అధ్యక్షురాలిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు.

ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలి



ఎస్పీ కోటిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌ఐలు వేణుగోపాల్‌గౌడ్, విద్యాచరణ్‌రెడ్డి

బషీరాబాద్/పెద్దేముల్: సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ.. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. బషీరాబాద్ ఎస్‌ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాల్‌గౌడ్, పెద్దేముల్ ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డిలు గురువారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారితో మాట్లాడారు. సమస్యలతో ఠాణాకు వచ్చిన వారితో సోదరభావంతో ఉంటూ.. భరోసా కల్పించాలని సూచించారు. నేరగాళ్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ.. శాంతి భద్రతలను కాపాడాలని, పోలీస్‌స్టేషన్‌కు మంచి పేరుతేవాలని చెప్పారు.

జీపీలకు నిధుల విడుదల హర్షణీయం

కుల్కచర్ల: గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల కావడం హర్షణీయమని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడారు. ఎన్నో రోజులుగా నిధులు పెండింగ్ ఉండటం వలన జీపీల ప్రజాప్రతినిధులు తీవ్ర ఇబ్బందులకు గరవుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని గ్రహించిన సీఎం కేసీఆర్ అన్ని విధాలా నిధులను విడుదల చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారని ఆయన చెప్పారు. రెండు రోజుల్లో గ్రామాల ఖాతాల్లో నిధులు జమకానున్నాయని వెల్లడించారు. సర్పంచులు, ఎంపీటీసీలు ఉత్సాహంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని సూచించారు.

ఆటల్లో గెలుపోటములు సహజం



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్

షాబాద్: దివంగత నేత పార్లమెంట్ మాజీ సభ్యుడు వర్రీ తులసిరామ్ స్మారకార్థం నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయని బీజేపీ నియోజకవర్గ నాయకుడు వర్రీ విజయ్‌కుమార్ చెప్పారు. గురువారం మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ మినీ స్టేడియంలో టోర్నీ ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకు పోటీలు దోహదపడతాయన్నారు. గ్రామాల మధ్య స్నేహ సంబంధాలను పెంచేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా తీసుకోవాలని సూచించారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 25వేల నగదు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, శంకర్‌పల్లి అధ్యక్షుడు రాములుగౌడ్, టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్, యువమోర్చా జిల్లా కార్యదర్శి కూతురు మహేందర్, పార్టీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాజాసింగ్‌గౌడ్, రమేష్, కర్ణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోండి

కొందుర్గు: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ చౌదరిగూడ మేనేజర్ సుధీర్‌కుమార్ సూచించారు. గురువారం పెద్ద ఎల్కిచర్లలో సర్పంచ్ భూపాలచారి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, జీవనజ్యోతి, పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కండి

శంకర్‌పల్లి: అయ్యప్ప దేవాలయం నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, శంకర్‌పల్లి మాజీ ఉప సర్పంచ్ సాత ప్రవీణ్‌కుమార్ కోరారు. గురువారం మండలంలోని మహాలింగపురం గ్రామానికి చెందిన ఎం. రాఘవేందర్‌రెడ్డి రూ. 1లక్ష 1వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన పెంచుకోవాలని సూచించారు. ఆలయ నిర్మాణానికి దాతలు రావాలన్నారు. గ్రామాల్లో అయ్యప్ప ప్రచారం రథం తిరుగుతుందని, భక్తులు విరివిగా విరాళాలు, కానుకలను అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ యువజన విభాగం అధ్యక్షుడు పాండురంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పీపుల్స్ మార్చ్‌కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



పీపుల్స్‌మార్చ్‌కు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: సీఎల్పీ నేత భట్టివిక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర గురువారం జడ్చర్ల నియోజకవర్గంలో కొనసాగింది. ఈ సందర్భంగా పట్టణం నుంచి పీసీసీ కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున తరలివెళ్లారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో కొనసాగుతున్న అవినీతి పాలనను ప్రజలకు తెలియజేసేందుకే కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర చేపట్టిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల పక్షాన పోరాడాలని పిలుపునిచ్చారు.

పారితోషికం రూ.18వేలకు పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

అనంతగిరి: ఆశ వర్కర్ల పారితోషికం రూ.18వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తెలంగాణ ఆశ వర్కర్ల యూనియన్(సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ ఆశలకు పనిభారం తగ్గించి, ప్రతినెల ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలన్నారు. జాబ్ చార్ట్‌ను విడుదల చేయాలని, పీఆర్‌సీ ఏరియర్స్, కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు రూ.వెయ్యి చొప్పున 16 నెలల బకాయి వెంటనే చెల్లించాలన్నారు. అంతే కాకుండా ఖాళీలను బర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఆశ వర్కర్లు మాధవి, చంద్రకళ, మంజుల అనిత, గిరిజ, మంగ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

వ్యవసాయ అధికారి వసంత



విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ వసంత, ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్

మర్పల్లి: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఓ వసంత వ్యాపారులను హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్, పెస్టిసైడ్, విత్తన దుకాణాలను ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్‌తో కలిసి ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడారు. వానాకాలం సీజన్ మొదలైందని, రైతులు తమ పొలాల్లో విత్తనాలు విత్తేందుకు సిద్ధమవుతున్నారని ఆమె చెప్పారు. అన్నదాతలకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయించాలని వ్యాపారులకు సూచించారు. నకిలీ విత్తనాలు, ప్రభుత్వం ఆదేశించిన దానికంటే అధిక ధరలకు విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకోవడంతో పాటు దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అంతే కాకుండా విధిగా ప్రతి దుకాణంలో ధరల పట్టిక, విత్తనాల నిల్వ వివరాలు ఉండేలా దుకాణ దారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పని సరిగా రసీదు తీసుకోవాలని, నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు, వ్యవసాయ శాఖ అధికారులకు లేదా 100 టాస్క్ ఫోర్స్ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఏఓ రైతులకు సూచించారు.

శాంతిభద్రతలు కాపాడటమే లక్ష్యం

బంట్వారం: వాహన దారులు తప్పని సరిగా రోడ్డు నియమాలు పాటించాలని ధారూరు సీఐ అప్పయ్య అన్నారు. గురువారం సాయంత్రం బొప్పునారంలో నిర్వహించిన పోలీసు కళాబృందం పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నేరాలను అరికట్టడంతో పాటు శాంతి భద్రతలను కాపాడటమే పోలీసుల లక్ష్యమన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

తండాపై చిన్నచూపు

- మూడు రోజులుగా తాగునీరు బంద్
- పట్టించుకోని సర్పంచ్, కార్యదర్శి



గుమ్మల వద్ద నీరు పట్టుకుంటున్న స్థానికులు

నవాబుపేట: నవాబుపేట మండలంలో ఉన్న ఏకైక తండా కేశవపల్లి. జనాభా 400 కూడా మించక పోవడంతో గ్రామ పంచాయతీగా ఏర్పాటు కాలేదు. గతంలో ఉన్న కేశవపల్లి పంచాయతీకే ఇప్పుడు కూడా అనుబంధ గ్రామంగా కొనసాగుతోంది. అనుబంధ గ్రామం కావడంతో సర్పంచ్ సుధాకర్‌రెడ్డి కానీ.. పంచాయతీ కార్యదర్శి జయసిహ్మారెడ్డి కానీ.. వారానికి ఒక్కసారి కూడా గ్రామానికి రావడంలేదని తండా వాసులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి తాగునీటి సరఫరా కోసం రెండేళ్ల కింద మిషన్‌భగీరథ వాటర్ ట్యాంకు నిర్మించారు. కానీ ఎప్పుడూ ఏదో సమస్య ఉందంటూ ట్యాంకులకు నీరు వదలడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. మూడు రోజులుగా మిషన్‌భగీరథ నీళ్లు రాక ఇబ్బంది పడుతున్నామని చెప్పారు.

గుమ్ముల ద్వారానే..

తాగు నీరు అందించేందుకు గంతంలో నిర్మించిన గుమ్ముల ద్వారానే ప్రస్తుతం నీటి సరఫరా అవుతోందని, కానీ అవి సరిపోవడంలేదని తండా వాసులు వాపోతున్నారు. భగరథ నీరు విషయమై సర్పంచ్, కార్యదర్శికి ఫోన్ చేస్తే.. పైపులైన్ బాగ లేదని సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బావి నుంచి గుమ్ముల్లోకి వస్తున్న నీటిని ట్యాంకులోకి వదిలితే గ్రామంలో తాగునీటి సమస్య ఉండదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు 'సాక్షి' ఫోన్ చేయగా అతను స్పందించలేదు. సర్పంచ్‌ని వివరణ కోరగా మూడు రోజులుగా పైపులైను మరమ్మతు వలన నీరు రావడం లేదని, తండా వాసులు బావి నీరు ట్యాంకులకు వదలాలని కోరుతున్నారని,అధికారులను సంప్రదించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

'కంటివెలుగు'ను వినియోగించుకోండి



మోమిన్‌పేట: కంటి పరీక్ష కోసం శిబిరానికి వచ్చిన గ్రామస్తులు



కొడంగల్ రూరల్: కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మోమిన్‌పేట: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రాజశేఖర్ కోరారు. గురువారం మల్లారెడ్డిగూడెంలో కంటివెలుగును ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ కంటి చూపు బాగుండాలనే ఉద్దేశంతో.. పల్లెల్లో కంటివెలుగును నిర్వహిస్తుందని, కంటి పరీక్ష అనంతరం ఉచితంగా కళ్లద్దాలు ఇస్తుందని తెలిపారు. కావున ప్రజలు నేత్ర శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటివెలుగు కార్యక్రమాన్ని కంటి చూపు మందగించిన వారు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్లు హరిప్రసాద్, మహేందర్ అన్నారు. అంగడి రాయిచూర్ పీహెచ్‌సీలో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరంలో వారు మాట్లాడారు. కంటి సమస్య ఉన్నవారికి ఉచితంగా పరీక్ష చేస్తామని, అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు పంపిణీ చేస్తామని, శస్త్ర చికిత్స నిర్వహిస్తామని తెలిపారు.

ఓపెన్ యూనివర్సిటీ కేంద్రం పరిశీలన



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వికారాబాద్ అర్బన్: పట్టణంలోని అనంతపద్మనాభ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ సెంటర్‌ను గురువారం యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ ఉషశ్రీలు సందర్శించారు. ఈ సందర్భంగా దూరవిద్యలో సైన్స్ చదువుతున్న విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించారు. ప్రాక్టికల్స్ తరగతులు , పరీక్షల నిర్వహణపై చర్చించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంధారిక, స్టడి సెంటర్ కో ఆర్డినేటర్ చిన్న సోమన్న ఉన్నారు.

అసంపూర్తి రోడ్డుతో అవస్థలు

నిలిచిన గోపన్‌పల్లి రోడ్డు పనులు

తాండూరు రూరల్: అసంపూర్తి రోడ్డు పనులతో బాటసారులు, ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గౌతపూర్ అనుబంధ గ్రామం గోపన్‌పల్లికి వెళ్లే ప్రధాన రహదారి పనులు మధ్యలో ఆగిపోయాయి. సదరు కాంట్రాక్టర్ మట్టివేసి వదిలేయండంతో కరన్‌కోట్‌కు వెళ్లే వాహనదారులు దుమ్ముధూళితో ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం వచ్చేలోగా రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. రోడ్డు మరమ్మతుకు ప్రభుత్వం ఇప్పటికే రూ.9.50 కోట్లు మంజూరు చేసిందని, బిల్లులు రాకపోవడంతో పనులు మధ్యలో ఆపేసినట్లు తెలుస్తోంది. ఇదే విషయమై ఆర్‌అండ్‌బీ డీఈని 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా.. గోపన్‌పల్లి నుంచి కరన్‌కోట్ రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేశామని.. గౌతపూర్ నుంచి గోపన్‌పల్లి రోడ్డు పనులు త్వరలో పూర్తి అవుతాయని చెప్పారు.



చెక్‌పోస్ట్ సమీపంలో ఆగిపోయిన రోడ్డు పనులు